క్లుప్తంగా

కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు సన్మానం




సన్మానిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టరేట్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లును వేర్వేరుగా వారి చాంబర్‌లలో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేసేందుకు ధర్నా చౌక్‌ను ఏర్పాటు చేయాలని, క్రమబద్ధీకరణకు 2014 కట్ ఆఫ్ డేట్‌ను ఎత్తివేసి అందరికీ పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, వై.శ్రీనివాసరెడ్డి, వి.పూర్ణచందర్‌రావు, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాణచారి, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత పాపకొల్లు జట్టుకు నగదు, షీల్డ్ అందజేస్తున్న అతిథులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనిమిది రోజులుగా జరుగుతున్న నాలుగు మండలాల స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో జూలూరుపాడు చంద్ర రామయ్య మెమోరియల్ జట్టుపై పాపకొల్లు విజయం సాధించింది. విజేత జటుట్‌కు రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.10,116 వేలు నగదు, షీల్డ్‌లను అందజేశారు. తృతీయ బహుమతి మహేష్ మెమోరియల్ జట్టుకు రూ,8,116, నాలుగో బహుమతి జూలూరుపాడు డీజే నాగరాజు జట్టుకు రూ.6,116 అందజేశారు.

ఉపాధ్యాయుడికి హరివిల్లు పురస్కారం



చెన్నారావు

పాల్వంచ: పట్టణంలోని ఆశ్రమ గిరిజన ఉన్నత బాలుర పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు బానోతు చెన్నారావు హరివిల్లు పురస్కారం అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో చెన్నారావు వెయ్యి హరివిల్లులను పూర్తి చేశారు. దీంతో సాహిత్య వేదిక అధ్యక్షుడు సీర హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిట్టి మధు చేతుల మీదుగా మంగళవారం పురస్కారం అందుకున్నారు. గతంలో భక్తా గ్రేసరుడు, బమ్మెర పోతన ప్రశాంసా పత్రాలను అందుకున్నారు. అదేవిధంగా గతంలో మూడు పుస్తకాలను సంకలనం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.నందా, తోటి ఉపాధ్యాయులు చెన్నారావును అభినందించారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో ఈనెల 26న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరగనున్న 73వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అన్నారు. మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో జీఎం వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతూ.. ముఖ్యఅతిథులచే జాతీయ పతాకావిష్కరణ, పాఠశాలల విద్యార్థులచే మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీల్లో 'చెత్త శుద్ధి'పై నిర్లక్ష్యం

- అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు
- అటకెక్కిన తడి, పొడి చెత్త సేకరణ
- ఆరుబయట కాల్చేస్తున్న సిబ్బంది



బస్వతారక కాలనీ పంచాయతీలో షెడ్ బయటనే వేసిన చెత్త

పాల్వంచరూరల్: రూ.లక్షలు వ్యయం చేసి తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేసేందుకు నిర్మించిన సెగ్రిగేషన్... పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నేడు అలంకారప్రాయంగా మారాయి. కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం కింద తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేయాలని.. ఇలా తయారు చేసిన ఎరువును హరితహారం మొక్కలకు వేయడంతో పాటు, వ్యవసాయ పంటలకు ఉపయోగపడేలా రైతులకు విక్రయించాలి. తద్వారా గ్రామపంచాయతీ ఆదాయాన్ని సమకుర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.లక్షలు వ్యయం చేసి సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీలలో ఒక్కో షెడ్ నిర్మాణానికి రూ.2.50లక్షల ఖర్చు చేసి పంచాయతీకో సెగ్రిగేషన్ షెడ్ నిర్మించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి షెడ్లలో ఏర్పాటు చేసిన అరలలో వేయాలి. ఇందుకోసం ప్రతి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి షెడ్లలో వేస్తారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరుచేయాలి. తడి, పొడి చెత్తను వేరుచేసేందుకుగాను గ్రామపంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. కానీ కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రక్రియ అటకెక్కింది. కొన్ని పంచాయతీలలో చెత్తను షెడ్లలో దహనం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం...

గ్రామపంచాయతీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అమలు చేయడానికి జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో గ్రామపంచాయతీలో చెత్తసేకరణ జరుపుతున్నారు కానీ, ఎరువుగా మార్చే ప్రక్రియ చేయడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

అలంకార ప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు...

గ్రామపంచాయతీల్లో రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి. గ్రామాలకు శివార్లలో నిర్మించిన ఈ షెడ్లలో యువకులు, ఆకతాయిలు మద్యం సేవించేందుకు వినియోగించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



యానంబైల్ వద్ద నిరుపయోగంగా షెడ్

చెత్తను వేరు చేయడం లేదు



గ్రామపంచాయతీలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎరువు తయారు చేయించి అమ్మితే పంచాయతీకి ఆదాయం వస్తుంది. – రాము

ఎవరూ పట్టించుకోవడం లేదు



ప్రజలు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వాహనంలో వేయాలనే అవగాహన లేదు. వేర్వేరుగా చెత్త సేకరిస్తేనే ఎరువును సులభంగా తయారు చేస్తాం. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పథకం అమలు కావడం లేదు. – వీరయ్య

అవగాహన కల్పిస్తున్నాం



తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వేర్వేరుగా ట్రాక్టర్‌లో వేయాలనే చైతన్యం రావడం లేదు. అన్ని సెగ్రిగేషన్ షెడ్లలో ఎరువు తయారు చేస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటున్నాం. బి.నారాయణ, ఎంపీఓ

ఏరియా జీఎం గని సందర్శన



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ రమేష్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే-7షాఫ్ట్ గనిని మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ అకస్మికంగా విజిట్ చేశారు. మాట్లాడుతూ.. భూగర్భగనిగా విరాజిల్లిన ఈ గనిలో బొగ్గు నిల్వలు తగ్గిన నేపథ్యంలో ఇంకా మిగిలిపోయిన నిల్వలను తొలగించేందుకు గనిని ఓపెన్ కాస్ట్‌గా చేసేందుకు కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో గనిలో ఉన్న స్క్రాప్ (పాత మెటీరియల్) అవసరాన్ని బట్టి గనికి వినియోగించుకొని మిగిలిన మెటీరియల్‌ను ఏరియా స్టోర్స్‌కు తరలించాలని చెప్పారు. తరలించే ప్రతి వస్తువును రికార్డ్ చేసి పంపించి స్టోర్స్‌లో ఎంట్రీ చేయాలన్నారు. వీటిపై విజిలెన్స్ నిఘా ఉందని, ప్రతి వస్తువును రికార్డ్ చేయా లని సూచించారు. పనికి రాని వస్తువులను స్క్రాప్‌కు పంపించాలని ఆదేశించారు. వస్తువులు తీసేముందు, లోడింగ్ చేసేముందు తగు జాగ్రత్తలు, రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ మేనేజర్ జరుపుల శంకర్, భూగర్భ గనుల ఏజెంట్ బూర రవీందర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి, జూనియర్ సర్వేయర్ డి.ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

టేకులపల్లి: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే స్థలం ఇచ్చి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇల్లెందు డివిజన్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం మొట్లగూడెం, సిద్ధారం గ్రామాల్లో పర్యటించారు. ఈనెల 20న రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల సాధన కోసం భారీ ర్యాలీ ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్లు ధనవంతులకే ఇచ్చారని ఆరోపించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో నేటికీ కూడు, గూడు, గుడ్డకు నోచుకోని నిరుపేదలు కోట్లల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జోగ అబ్బయ్య, అప్పయ్య, మహేష్, నాగయ్య, నరేష్, లక్ష్మా, లక్ష్మి పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీ కులగణన చేపట్టాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా 50శాతానికి పైగా ఉంటే విద్య, ఉద్యోగ తదితర రంగాలలో బీసీలకు 27శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 1931 నాటి లెక్కల ప్రకారం 50శాతం పైగా ఉన్న బీసీల అభివృద్ధికి ఇప్పటివరకు ప్రభుదత్వాల వద్ద సమగ్ర కార్యాచరణ లేదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి75 సంవత్సరాలు గడుస్తున్నా బీసీల లెక్కలు పక్కాగా లేకపోవడం దారుణమన్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో బీసీ గణన చేపడతామని హామీ ఇచ్చి మరిచిందని విమర్శించారు. కార్యక్రమంలో కోలా మల్లిక, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, సాయి, కేతిని కుమారి, నాగుల రవికుమార్, శనిగరపు నిరంజన్ కుమార్, గుడివాడ రాజేందర్ పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: బీసీ స్టడీ సర్కిల్ వారు ఇవ్వనున్న ఉచిత గ్రూప్-2 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం అభ్యర్థులకు 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారని వివరించారు. ఈనెల 20వ తేదీ లోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.


20న 'చలో ప్రగతి భవన్'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈ నెల 20వ తేదీన గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్ చౌహాన్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టే చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాళోత్ రాందాస్ నాయక్, నునావత్ జగ్‌మాల్ నాయక్, బానోత్ దుర్గాప్రసాద్, బానోత్ రాంబాబు పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్‌లో చేరికలు



టీఆర్‌వీకేఎస్‌లో చేరిన నాయకులు

పాల్వంచ: తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘంలో పలువురు చేరారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు బొల్లె పోగు రవి, బి.రవి, జీ.వీరన్న, మొయినుద్దీన్‌లు చేరారు. వీరికి యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, అచ్చ కోటిలింగం, ఎం.రమేష్, కాల్వ రవికుమార్, పద్మాకర్ రాజు, డి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, కాంతయ్య, బరగడి రామారావు, మంగీలాల్, టి.శేషం రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022 ఏప్రిల్ నెల నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, జేఎల్‌ఎం టూ ఏఎల్‌ఎం ప్రమోషన్లు ఇవ్వాలని, 2016లో 2,367 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజెన్లుగా మార్చారని, వీరందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ యునైటెడ్ సిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్, ప్రధాన కార్యదర్శి బొల్లి వెంకటరాజు పాల్గొన్నారు.

రెండు నెలల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రెండు నెలల్లో విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే వనమా వేంకటేశ్వరరావు అన్నారు. రామవరం గోధుమవాగు సమీపంలోని సింగరేణి మ్యాగ్జిన్‌లోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం 10 ఎకరాలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా విలేకరులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్లు రామకృష్ణ, వనమా కృష్ణప్రసాద్, కౌన్సిలర్లు కూరపాటి విజయలక్ష్మి, కొలాపురి ధర్మరాజు, రుక్మాంధర్ బండారి, పరమేష్ యాదవ్, అంబుల వేణుగోపాల్, పల్లపు లక్ష్మణ్, తంగెళ్ల లక్ష్మణ్, సింగరేణి ఎస్టేట్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేయాలి...

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. మంగళవారం బస్టాండ్ సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం అధికారికంగా జీఓ విడుదల చేసిందని, రాజకీయ జోక్యం లేకుండా విలేకరులందరికీ న్యాయం చేయాలన్నారు. రాయల శాంతయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, రాజా, నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రగిరి సత్యనారాయణ, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



ఇల్లెందు: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ, పక్కన కమిషనర్ అంకుషావలీ

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా అంధత్వ నివారణకు కృషి చేస్తోందని, పేదలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేసి శస్త్రచికిత్సలు, కంటి అద్దాలు అందజేసేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న పట్టణంలో 19వ వార్డులోని బాలికల హైస్కూల్‌లో, 7వ వార్డు మామిడిచెట్ల బడిలో రెండు కేంద్రాలలో కంటి వెలుగు శిబిరాలు ఎమ్మెల్యే హరిప్రియ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి రిజిస్ట్రేషన్‌లో బార్ కోడ్ ఉంటుందని, ఎవరికైనా అద్దాలు, ఆపరేషన్ అవసరం అయితే తదనంతరం ఈ బార్ కోడ్‌ను ఉపయోగించి వైద్యం అందించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ మాట్లాడుతూ... కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. 100 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు పథకాన్ని మండలంలో అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని రొంపేడు, కొమురారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం పీహెచ్‌సీల పరిధిలో జనాభా ప్రాతిపదికన పరీక్షలు నిర్వహించే తేదీలను నిర్ధేశించామన్నారు. 19వ తేదీ నుంచి పరీక్షలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని తెలిపారు.

29న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈనెల 29న కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపునేని సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వెంకట్యాతండా గ్రామంలో కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారు అన్నిరంగాల్లో ముందుకెళ్లేలా ప్రోత్సహించడమే ఆత్మీయ సమ్మేళనం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇళ్లకే పరిమితమైన దివ్యాంగులను ఒకచోట చేర్చి వారిని చైతన్యవంతులను చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే వేదికపై ఓ ఆదర్శ జంటకు వివాహం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాళోతు జగ్గు దాస్, బాణోతు లక్ష్మా, బోడ అమ్మి, బి.రమేష్, మాళోతు భద్రు, ఇమామ్, షణ్ముఖచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎం స్పందించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఎల్‌సీ బృందం

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక క్షేత్రాల్లో కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్ స్పందించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. మంగళవారం మంచికంటి భవన్‌లో యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఈనెల 18న ఖమ్మం రానున్న సందర్భంగా సింగరేణి కార్మికుల ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గోదావరిఖని ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు యాజమాన్యం రూ.500 కోట్లు ఇస్తున్నందుకు కార్మికుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లు కొంత శాతాన్ని ప్రకటించారు. ఇది హర్షించదగిన విషయం అన్నారు. అయితే కోల్‌బెల్ట్ ప్రాంతంలో కార్మికులకు కలుషిత నీరును పంపిణీ చేస్తున్నారని దీనివలన కార్మిక కుటుంబాలు రోగాల బారిన పడుతున్నారని ఈ నేపథ్యంలో వారికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో ఆర్‌ఎల్‌సీ సమక్షంలో అగ్రిమెంట్ చేసిన మారు పేర్లు, అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ ట్రేడ్స్‌మెన్, ఆపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ కల్పించే అంశాలపై యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయడంలో జాప్యాన్ని నివారించాలన్నారు. సింగరేణి ప్రాంతంలో కార్మికుల కట్టుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలు ఇస్తున్నారు కానీ కొత్తగూడెం ఏరియాలో ఇవ్వటం లేదని ప్రభుత్వం కార్మికుల చిరకాల కోరిక సొంతింటి కల నెరవేర్చేందుకు ఎవరి క్వార్టర్ వారికే లేదా 240 గజాల స్థలం ఇవ్వాలని కోరారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి వరద బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని పౌరహక్కుల సంఘం (సీఎల్‌సీ) ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గోదావరి ముంపు బాధితులను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల ఆదుకోవాలని బృందం కోరింది. ఐదునెలలుగా భద్రాచలం క్రాస్‌రోడ్డులో దీక్షలు నిర్వహిస్తున్న నిర్వాసితులను సీఎల్‌సీ బృందం సందర్శించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.రవికుమార్, ఎస్.ఉపేందర్, కె.శ్రీనివాస్, దుర్గారెడ్డి, రమణ, మోహన్, మురళి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పట్టణానికి కదం తొక్కండి..



సూపర్‌బజార్(కొత్తగూడెం): మాట్లాడుతున్న బసవరాజు సారయ్య పక్కన వనమా



ఇల్లెందు: మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు: ఖమ్మం నుంచే దేశ చరిత్రను మార్చేందుకు గులాబీ శ్రేణులు నడుం బిగించాలని, యావత్ దేశం చూపు ఖమ్మం వైపు అన్నచందంగా ప్రతిఒక్కరూ ఖమ్మానికి దండు కట్టాలని బీఆర్‌ఎస్ నేత, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే హరిప్రియ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

టేకులపల్లి: ఖమ్మంలో ప్రతిష్టాత్మకంగా బుధవారం జరగనున్న భారీ బహిరంగ సభకు టేకులపల్లి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ఎంపీపీ భూక్యా రాధ, మండల ఇన్‌చార్జ్ ప్రవీణ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అనంతరం వారు మాట్లాడారు.


పాల్వంచరూరల్: నేడు ఖమ్మం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయంవంతం చేయాలని తెలంగాణ దళిత సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వంగలపూడి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విధంగా ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ జరుగుతుందని కార్యక్రమ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చిన తరువాత నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభని, దిగ్విజయం చేయాలని కోరారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యమకారులు కదిలి రావాలన్నారు. ఖమ్మం బీఆర్‌ఎస్ సభకు నియోజకవర్గం నుంచి 20వేల మందిని తరలిస్తున్నట్లు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. 200 బస్సులు, ఇతర వాహనాలలో సభకు వెళ్తున్నట్లు చెప్పారు.

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 18న ఖమ్మంలో బీఆర్‌ఎస్ బహిరంగ సభకు బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. మంగళవారం ఏరియాలోని వర్క్‌షాపులో మాట్లాడారు.

అటెన్షన్ ప్లీజ్

తవ్వారు.. వదిలేశారు



టేకులపల్లి మండల కేంద్రంలోని బోడ బజారులో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మిషన్ భగీరథ అధికారులు పైపులైన్లు వేయించారు. కానీ పూర్తిస్థాయిలో పైపులైన్లు వేయలేదని, కనెక్షన్లు ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా పైపులైన్ల కోసం తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో రోడ్డు పక్కనే పెద్దగుంత ఏర్పడింది. పక్కనే రోడ్డుపై మట్టికుప్ప పోశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళలో వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ గుంతలు తవ్వి సుమారు నెల రోజులు దాటినా అధికారులు మాత్రం గుంత పూడ్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

\- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : పద్మావతి
మిషన్ భగీరథ డీఈ, ఇల్లెందు
సెల్ నంబర్ : 9100121913